## మూతపడ్డ మండల విద్యా వనరుల కేంద్రం



తాళం వేసి ఉన్న మండల విద్యా వనరుల కేంద్రం

తాంసి, డిసెంబర్ 23 : తాంసిలోని విద్యా వనరుల కేంద్రం 14 రోజులుగా మూసివేసి ఉంది. ఎమ్మార్సీ ఆధ్వర్యంలో పని చేసే సిబ్బంది సీసీవో, ఎంఐఎస్, మెసెంజర్లు, ఐఆర్పీలు, సీఆర్పీలు, పీటీఐలందరూ ఈ నెల 10 నుంచి సమ్మెబాట పట్టడంతో మండలంలో విద్యా వ్యవస్థకు సంబంధించిన పనులు స్తంభించిపోయాయి. మధ్యాహ్న భోజన బిల్లులు యూడైస్ ప్లేస్‌కు సంబంధించిన పనులు, పాఠశాల పర్యవేక్షణకు సంబంధించిన పనులు కొనసాగక విద్యావ్యవస్థ కుంటుపడింది. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినటువంటి హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## టీఎస్ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

ఇచ్చోడ, డిసెంబర్ 23: నల్గొండ జిల్లాలో ఈ నెల 28, 29, 30వ తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర, విద్య, వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 23 : వినియోగదారులు వారికి ఉన్న హక్కులను తెలుసుకోవడంతో నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసుకోవాలని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్‌లో వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కంజుమర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో సంతకాల సేకరణ చేపట్టగా సీఐతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు సంతకాలు చేసినంతరం పట్టణంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు దొమ్మటి కిరణ్ కుమార్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

ఎదులాపురం, డిసెంబర్ 23 : ఆదిలాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న సంఘ భవన నిర్మాణానికి చర్యలు తీసుకునేందుకు తీర్మానాలు చేసినట్లు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర పధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ బాడి సమావేశంలో సంఘ అభివృద్ధితో పాటు భవన నిర్మాణం, సభ్యత్వం తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారన్నారు. 20 ఏండ్ల క్రితం సంఘ భవన అదనపు పనులు ప్రారంభమయ్యాయని అవి ఇప్పటికే అలాగే ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసేల కార్యాచరణతో పాటు సభ్యత్వ నమోదు, కిరాయిలకు సంబంధించి అగ్రిమెంట్లు ముగిసిన నేపథ్యంలో వాటిని రెన్యువల్ చేయడం లాంటిపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలు చేశామని తెలిపారు.

# అన్నదమ్ముళ్ల కలిసి ఉండాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే




ఇచ్చోడ: మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఇచ్చోడ, డిసెంబర్ 23: మతాలు, కులాలు అని కాకుండా అందరూ అన్నదముళ్ల కలిసి ఉండాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం ఇచ్చోడలోని ఓ గార్డెన్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేను బోథ్ పాస్టరేట్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా క్రైస్తవుల క్రిస్మస్ పండుగను అధికారికంగా జరపాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ దురదృష్టవశాత్తు కేసీఆర్ అధికారంతో పాటు క్రిస్మస్ పండుగ సందర్భంగా అందించే చిరుకానుక కూడా వెళ్లిపోయిందదన్నారు. శాంతి సమానత్వాలకు నిస్వార్థ సేవకు ఆదర్శం క్రైస్తవత్వమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలి

నేరడిగొండ, డిసెంబర్ 23 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుచుకోవడం ద్వారా జీవితంలో ప్రశాంతతను పొందుతారని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. రాజులతాండా గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిర కళశపూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామస్తులు బుద్దికొండ శబరిమాత ఆశ్రమం నుంచి రాజులతండా గ్రామం వరకు కళశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లగా ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సొనాల మాజీ సర్పంచ్ సదానందం,నాయకులు ప్రతాప్‌సింగ్, సరిచంద్, లింబాజీ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను సన్మానించిన చిన్న బుగ్గారం గ్రామస్తులు

నేరడిగొండ మండలం చిన్న బుగ్గారం గ్రామస్తులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు.అసెంబ్లీలో ఇటీవల గిరిజన విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అంశంపై ప్రస్తావించడంతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిపై గళమెత్తడంతో ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విలాస్, హెమ్యానాయక్ పాల్గొన్నారు.

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్, డిసెంబర్ 23: గిరిజనులు పెట్టుకుంటున్న అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారులతో ఆమె మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గాదిగూడ మండలం మారుగూడ గ్రామస్తులు గ్రామానికి వంతెన నిర్మాణం కావాలని, సిర్పూర్(టీ) మండలం భూపాలపాలేం గ్రామానికి చెందిన సిడాం వెంకట్ తన వ్యవసాయంలో విద్యుత్ బోర్ మంజూరు చేయాలని, సిర్పూర్(యూ) మండలం సెట్టిహడుపూర్ గ్రామానికి చెందిన చిన్ను తనకి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పింఛన్లు, రెండు గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలు, వ్యవసాయ పనిముట్లు కావాలని అర్జీలు పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావ్, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పత్తి ధర తగ్గింపు

బోథ్, డిసెంబర్ 23 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్ల ధరను ఈ నెల 27 నుంచి తగ్గిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. బీబీ ఎస్‌పీఎల్ మోడ్ రకం పత్తి వస్తున్నందున క్వింటాల్‌కు రూ.7471 ధర చెల్లించి కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ధరణి రాజేశ్



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధరణి రాజేశ్

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 23: బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఉండాలని, ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించడం జరిగిందని తెలిపారు.

## అనుమానాస్పదంగా బాలిక మృతి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 23: ఉట్నూర్ మండలం గంగాపూర్ గ్రామంలో అనుమానాస్పదంగా బాలిక మృతి చెందింది. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన సీలం ఎల్లన్న, అంకవ్వ దంపతులకు ముగ్గురు కూతుర్లు. వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నారు. సోమవారం చిన్న కూతురు హరిత(10) అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. ఉదయం అనుమానా స్పదంగా మృతి చెందింది. పోస్టుమార్టం కోసం స్థానిక దవాఖానకు తరలించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి వసతి కల్పించాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 23 : నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి వసతి కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి తొడసం శంభు, పంద్రం ఆనందరావ్, ఉయిక భీమ్ రావ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి సదుపాయం లేకపోవడంతో వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. కార్యాలయంలో తాగునీటి వసతి కల్పించాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 23 : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

పెంబి, డిసెంబర్ 23: సకాలంలో బిల్లులు, వేతనాలు అందించాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ లక్ష్మణ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## నర్సరీల పనులు వేగ వంతం చేయాలి

దస్తురాబాద్, డిసెంబర్ 23 : నర్సరీల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని మున్యాల, దస్తురాబాద్, గొడిసేర్యాల, గొడిసేర్యాల గోండుగూడెం(జీ) గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. నర్సరీల పనులు, గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్ రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

## మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి



ఎదులాపురం: కిసాన్ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

ఎదులాపురం, డిసెంబర్ 23 : రైతులు పండించిన పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని అఖిల పక్షం రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆదిలాబాద్‌లోని కిసాన్ చౌక్‌లో కిసాన్ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను జరుపుకున్నారు. జై కిసాన్ జైజై కిసాన్ అంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్షం రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోవర్ధన్, పొశెట్టి, రోకండ్ల రమేశ్, నారాయణ, లంక రాఘువులు, సచిన్, కిరణ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 23: మండలంలోని గొసంపల్లె, కొత్తపేట్, బావపూర్, గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో సునీత పర్యటించారు.సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీవో చిక్యాల రత్నకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు,



బోథ్: నాగ భూషణం పాఠశాలలో రైతులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



ముథోల్: వ్యవసాయ చేనులలో పనులు చేస్తున్న విద్యార్థులు

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

బోథ్/తలమడుగు/సోన్/ముథోల్/కుంటాల/భైంసా, డిసెంబర్ 23: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రైతుల వేషధారణలో సాగు పనులు చేస్తూ ఆకట్టుకున్నారు. రైతులు పండించే పంటలు, నిత్యం చేపట్టే పనులు, వారు పడే శ్రమను ఉపాధ్యాయులు వివరించారు. పలు పాఠశాలల్లో రైతులను సన్మానించారు. తలమడుగు మండలం భరంపూర్ గ్రామంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, గ్రామస్తులు రైతులను సన్మానించారు. భైంసాలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ ఆనంద్ రావు పటేల్ పలువురు రైతులను శాలువాతో సత్కరించారు.



కుంటాల: వాసవి విద్యాసంస్థల్లో రైతు దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు



తలమడుగు: రైతులను సన్మానిస్తున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

## వ్యక్తి గత మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

దిలావర్‌పూర్. డిసెంబర్ 23: ప్రతి ఒక్కరూ వ్యక్తి గత మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని ఎంపీడీవో అరుణరాణి అన్నారు. సోమవారం కదిలి పాపహరేశ్వర ఆలయ సమీపంలో భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో దివ్యరెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్‌రావ్, ఈసీ అనిల్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు రమణ, వెంకట్‌రావ్, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

BY THIS DEED I, THE UNDER SIGNED **LAMBADI GANGYA S/O. RATHOD RAVOJI,** R/O. H.NO. 2-145/5 GOPALPET THANDA VILLAGE & MANDAL: SARANGAPUR DIST. NIRMAL, T.S. PIN 504110 HAVE CHANGED MY NAME TO **RATHOD GANGARAM** FOR ALL FUTURE PURPOSE.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## పర్యావరణ హితమైన.. పెండ్లి కార్యం



వెదురు బుట్టలతో వాయినాలు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

ఎదులాపురం, డిసెంబర్ 23 : ఆదిలాబాద్‌లోని పాతహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గిరీశ్ కౌటిక్వార్ స్థానిక ఆకాశవాణిలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. తన కుమారుడి పెండ్లి సందర్భంగా పసుపు బొట్టు కార్యక్రమంలో ప్లాస్టిక్ వస్తువులను కాకుండా వెదురు బుట్టలను వినియోగించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గిరీశ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించకుండా తన కుమారుడి పెండ్లి జరిపించాలని తన భార్య శ్రీదేవి సలహా మేరకు ప్లాస్టిక్‌ను వినియోగించడం లేదన్నారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని, దాని వల్ల వాతావరణంలో కలుష్యం పెరుగుతుందన్నారు. దానిని నివారించడంలో భాగంగా తొలి అడుగుగా తమ వంతుగా సహజ సిద్ధమైన వస్తువులను వినియోగిస్తున్నామని తెలిపారు.

## విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

ఎదులాపురం, డిసెంబర్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో42 ప్రభుత్వ పాఠశాలలు ప్రైమరీ, యూపీఎస్ హెడ్ మాస్టర్లు, టీచర్ల (రిసోర్స్ పర్సన్స్)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 42 ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ ఇవ్వాలని, అందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని డీఈవో ప్రణీతను ఆదేశించారు. ట్రైనింగ్ అన్ని పాఠశాలల టీచర్లకు ఇంగ్లిష్, సోషల్, మ్యాథ్స్, ఏవీఎస్, స్పోకెన్ ఇంగ్లిష్, ఒకటి నుంచి ఐదో సబ్జెక్టుల వారీగా శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం సంక్రాంతి పండుగ తర్వాత నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీకాంత్, సుజిత్ ఖాన్, అజయ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్, డిసెంబర్ 23: ప్రభుత్వ సంక్షేమ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీజీవీపీ ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తామని కొత్త మెనూను సైతం సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారన్నారు. కానీ అది కేవలం గోడకేసిన సున్నంలా మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ ప్రకారం ఆహారం విద్యార్థులకు అందించాలని సూచించినప్పటికీ ఇప్పటివరకు కూడా అది జరగడం లేదన్నారు. సమావేశంలో బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్, కన్వీనర్ పుల్లుంగుల సతీశ్ పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే భీం ఆర్మీ లక్ష్యం

ఇంద్రవెల్లి, డిసెంబర్ 23: పేదలను ఆదుకోవడమే భీం ఆర్మీ లక్ష్యమని భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్ అన్నారు. సోమవారం బోడ్డిగూడ గ్రామంలో భీం ఆర్మీ ఆధ్వర్యంలో కొలాం ఆదివాసీ గిరిజనులకు చలి తీవ్రత దృశ్య వృద్ధులతోపాటు విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీం ఆర్మీ మండలాధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తమ్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీశ్, నాయకులు కిరణ్, రాజేందర్ పాల్గొన్నారు.


## ప్రజా సమస్యలు చట్ట ప్రకారంగా పరిష్కరించాలి



సమస్యలు వింటున్న ఎస్పీ డాక్టర్ జానకిషర్మిల

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 23 : ప్రజా సమస్యలు చట్టప్రకారంగా సత్వరమే పరిష్కరించాలని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకిషర్మిల అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని విని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు.

## మహిళ లు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 23 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లోకల్ ఫర్ వోకల్ అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈడీఐఐ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆరు మండలాల స్వయం సహాయక సంఘ మహిళలు చేతివృత్తులు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల తయారీ, ప్యాకింగ్‌పై శిక్షణను పూర్తి చేసుకొని వారు తయారు చేసిన వస్తువుల స్టాళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పట్టణ తహసీల్దార్ రాజు, సీడీపీవో నాగమణి, లక్ష్మణచాంద ఎంపీడీవో రాథోడ్ రాధ, ఈడీఐఐ ప్రాజెక్టు అధికారి భూపతి, మహిళలు పాల్గొన్నారు.

## సాదా సీదాగా ప్రజా వేదిక

ఉట్నూర్, డిసెంబర్ 23: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజా వేదిక సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అదనపు డీఆర్డీవో కుంటుంబరావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల వారిగా ఉపాధి హామీ పనులు, జరిగిన అవకతవకలపై అడిట్ సిబ్బంది సూచించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులపై జరిగిన అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో ప్రమేయమున్న ఈజీఎస్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలోఅంబుడ్స్‌మెన్ కవిత, ఎంపీడీవో రాంప్రసాద్, ఏపీవో రాజేశ్వర్, ఏపీవో రజినీకాంత్, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, డిసెంబర్ 23: రాష్ట్ర వ్యాప్తంగా 14 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారితో ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట 14 రోజులుగా ఆందోళన చేస్తూ సమ్మెలోకి దిగిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నర్సింగ్ దేవీదాస్, గణేశ్, హరీశ్ పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్, డిసెంబర్ 23: ఖానాపూర్‌లో అమృత్ 2 పథకం ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు పైప్‌లైన్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో 67 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు

ఉట్నూర్, డిసెంబర్ 23: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సీతారాం స్పిన్నర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీలో టెక్నిషియన్, అసిస్టెంట్, మిషన్ ఆపరేటర్ లాంటి పోస్టులకు కొత్తవారిని 300 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల 18 నుండి 38 సంవత్సరాల యువత ఏడో తరగతి నుండి డిగ్రీ విద్యార్హత గలవారు ఉట్నూర్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 28లోపు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు.

## స్కూల్‌కు టీచర్ రావడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు

కుభీర్, డిసెంబర్ 23: మండలంలోని పల్సి కాంప్లెక్స్ పరిధిలోని కుప్టి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత పాఠశాలకు రావడం లేదని గ్రామస్తులు కుభీర్ ఎంఈవో విజయ్‌కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం పల్సి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దొంతుల సురేశ్‌తో కలిసి ఎంఈవో పాఠశాలను సందర్శించినట్లు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎం సురేశ్‌ను వివరణ కోరగా పాఠశాలకు వెళ్లి హాజరు పట్టికను పరిశీలించి విచారణ జరిపామన్నారు. నివేదికను డీఈవోకు పంపించినట్లు తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరుకావాలని సమాచారం లేకుండా దుమ్మాలు కొట్టే ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఏడు తరగతులకు గాను ఇక్కడ ఆరు తరగతులే కొనసాగుతున్నాయని ముగ్గురు టీచర్లు పని చేస్తుండగా హెచ్ఎం కవిత తరచూ గైర్హాజరవుతున్నట్లు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తెలిపారు.

## అగ్రి మార్కెటింగ్ విధానాల పత్రాల దహనం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 23: నిర్మల్‌లో సోమవారం కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న అగ్రిమార్కెటింగ్ కొత్తవిధానం, ముసాయిదా పత్రాలను జాతీయ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దహనం చేశారు. ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య, వ్యాక జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉద్యమ హామీల్లో భాగంగా రద్దు చేసిన రైతు వ్యతిరేక చట్టాలను దొడ్డి దారిన అగ్రి మార్కెటింగ్ విధానాల పేరుతో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడెం, డిసెంబర్ 23: బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం 6 నుంచి 9వ తరగతికి చెందిన వారి గురుకుల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ నచ్చన్ ఎల్లాపూర్ ప్రిన్సిపాల్ సీహెచ్ శకుంతల తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు రూ. 100తో tgswreis.telangana.gov.in, tgtwgurukulam.telangana.gov.in, jptbcwreis.telangana.gov.in, tgcet.cgg.gov.in ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాఠశాలకు అందుబాటులో ఉన్న వారు నచ్చన్ ఎల్లాపూర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంట వరకు నేరుగా దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

ఎదులాపురం, డిసెంబర్ 23 : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ జీవన్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఫిర్యాదుల కౌంటర్, స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు, పలు రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన డ్రిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలో భాగంగానే కేసుల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. అలాగే గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తూ ఉండాలన్నారు.

## కలప పట్టివేత



స్వాధీనం చేసుకున్న కలపతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది

ఇచ్చోడ, డిసెంబర్ 23: సిరిచెల్మలోని ఎల్లమ్మ గూడ అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్ ఫోర్స్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. అడవిలో అక్రమంగా నరికి చెక్కలు కోసిన చోట రూ.30 వేల విలువైన 20 టేకు చెక్కలు పట్టుకున్నారు. చెక్కలను స్వాధీనం చేసుకొని సిరిచెల్మ టింబర్‌కు తరలించినట్లు టాస్క్ ఫోర్స్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దండుగలను పట్టుకొని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు కవిత, బీట్ అధికారులు సజన్ లాల్, శ్యాంసుందర్, సుభాష్, సచిన్, స్వాతి, బేస్ క్యాంపు సిబ్బంది, డ్రైవర్ సమాధాన్ ఉన్నారు.